సాక్షి రంగారెడ్డి

శనివారం । 19 । ఆగస్టు । 2023



చేయిచేయి కలుపుదాం..

చేయిచేయి కలుపుదాం పచ్చదనాన్ని పరిరక్షిద్దాం అని రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. 8లో▸



బీజేపీ జెండా ఎగరాలి

వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షాద్‌నగర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు మూడో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

న్యూస్‌రీల్

రక్తదానంపై అవగాహన కల్పించే బాధ్యత యువతదే

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం: రక్తదానంపై అవగాహన కల్పించే బాధ్యత యువతదేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఉస్మానియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ కోసం ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం, అవయవదానంపై అపోహలతో దాతలు ముందుకురావడం లేదన్నారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం ముగ్గురికి ప్రాణదానం అవుతుందన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో రక్తం అవసరమున్న నిరుపేదలకు ఉపయోగపడేలా విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల డైరెక్టర్లు చంద్రకాంత్, పాండు రంగారెడ్డి, ఉస్మానియా అస్పత్రి బ్లడ్‌బ్యాంక్ వైద్యులు చైతన్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌బీటీ పొలిటికల్ సైన్స్‌కు ఎంఏ బీఈడీ పూర్తి చేసిన వారు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు, హెచ్‌బీటీ సైన్స్ బీఎస్సీ (బీజెడ్సీ) బీఈడీ వారు 6,7,8వ తరగతులకు, హెచ్‌బీటీ హిందీ హెచ్‌పీటీ ఎంఏ హిందీ బీఈడీ 9,10 తరగతులకు బోధించేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 21 వరకు దరఖా స్తులు సమర్పించాలని, 21, 22 తేదీల్లో ఇంటర్వ్యూ, డెమో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పీరియడ్‌కు రూ.182 చొప్పున నెలకు 100 పీరియడ్లకు గాను గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు.

బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: అర్హత కలిగిన పేదలకు డబుల్ బెడ్రూమ్స్, రేషన్‌కార్డులు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్స్, కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని హామీలిచ్చి విస్మరించారని విమర్శించారు. బీఆర్ఎస్ కండువా వేసుకున్న వారికే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని ఆరోపించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుపొంది అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు సుధాకర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిష్ తదితరులు పాల్గొన్నారు.

21న గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్: మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిలుకూరు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93471 97486 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మద్యం షాపులు 234 దరఖాస్తులు 18,000



మద్యం దుకాణాలకు చివరి రోజు దరఖాస్తుల వెల్లువ

- వ్యాపారులు, వాహనాలతో కిక్కిరిసిన ఎక్సైజ్ ప్రాంగణం
- సాయంత్రం ఆరు తర్వాత కూడా క్యూలైన్
- ఈ నెల 21న లాటరీ పద్ధతిన షాపుల కేటాయింపు



టెండర్లు దాఖలు చేసేందుకు క్యూ కట్టిన వ్యాపారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దరఖాస్తుకు చివరి రోజు, పైగా శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మద్యం షాపులకు టెండర్లు దాఖలు చేసేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. బండ్లగూడ ఎక్సైజ్ అకాడమీ గ్రౌండ్‌లో శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ జోన్ పరిధిలోని మద్యం దుకాణాలకు ఈనెల 4 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. సరూర్‌నగర్ జోన్ పరిధిలో 134 షాపులు ఉండగా, శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు తొమ్మిది వేలకుపైగా దరఖాస్తులు అందాయి. శంషాబాద్ జోన్ పరిధిలో 100 షాపులు ఉండగా, ఇక్కడ కూడా అదే స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు చివరి రోజు కావడంతో వ్యాపారులు క్యూకట్టారు. దీంతో సాయంత్రం ఆరు తర్వాత కూడా కౌంటర్లను తెరిచే ఉంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. శనివారం ఉదయం వరకు దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారుల వాహనాల రాకపోకలతో బండ్లగూడ, హిమాయత్‌సాగర్ పరిసరాలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 234 షాపులు ఉండగా, వీటికి ఇప్పటి వరకు 18 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శంషాబాద్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల్లోని ఒక్కో షాపునకు సగటున 150 నుంచి 200 దరఖాస్తులు అందినట్లు సమాచారం. దరఖాస్తుల ద్వారా గ్రేటర్ జిల్లాల నుంచి ప్రభుత్వానికి రూ.568 కోట్లకుపైగా ఆదాయం సమకూరగా, వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లా నుంచే రూ.361 కోట్లకుపైగా లభించడం విశేషం. ఈ నెల 21న శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో సరూర్‌నగర్, శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని షాపులకు వచ్చిన దరఖాస్తులకు లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు.

గ్రేటర్‌లో అందిన దరఖాస్తులు

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	వచ్చిన దరఖాస్తులు
హైదరాబాద్	80	2,490
సికింద్రాబాద్	99	2,510
శంషాబాద్	100	9,080
సరూర్‌నగర్	134	9,012
మేడ్చల్	114	5,352



కిక్కిరిసిన దరఖాస్తుదారులు



పార్క్ చేసిన వాహనాలు



చందన చెరువు కట్టపై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సబితారెడ్డి

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి సబితా రెడ్డి
- మీర్‌పేట చందన చెరువు వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక గౌడ కులస్తుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ అన్ని కులాలు, మతాలను సమానంగా ఆదరిస్తోందని అన్నారు. కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నారని, అందులో భాగంగానే గౌడ కులానికి కోకాపేట ప్రాంతంలో ముఖ్యమంత్రి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తున్నారని వివరించారు. గౌడన్నలకు రూ.5 లక్షల ప్రమాదబీమా, గీతవృత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ స్థలాల్లో తాటి, ఈత చెట్లను పెద్ద ఎత్తున పెంపకం చేపడుతోందని మంత్రి తెలిపారు. ఈ చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత సొసైటీలపై ఉందన్నారు. గతంలో గీత కార్మికులు ఆంక్షల మధ్య కల్లు అమ్ముకునే వారని, ప్రస్తుతం నగరం నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, గౌడ సంఘం నాయకులు పల్లె పాండుగౌడ్, పల్లె జంగయ్యగౌడ్, దిండు భూపేష్‌గౌడ్, బొబ్బిలి కిరణ్‌గౌడ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యేకు కేటీఆర్ ఫోన్

- జెడ్పీటీసీ సభ్యుడిని తీసుకురావాలని సూచన



తలకొండపల్లి: మంత్రి కేటీఆర్ శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఫోన్ చేశారు. మండల పరిధిలోని వీరన్నపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సమయంలో ఎమ్మెల్యేకు ఫోన్ కాల్ వచ్చింది. స్పీకర్ ఆన్ చేసి మాట్లాడటంతో ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మంత్రి మాట్లాడుతూ.. తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పలను పార్టీలోకి చేర్చుకుందాం, ఆయనను తోల్కొని రా అని చెప్పారు. మీ మండలంలో బలమైన నాయకుడు ఉప్పల వెంకటేశ్ ఉన్నాడు కదా.. ఆయనతో మాట్లాడి కుదిరితే పొద్దున్నే తీసుకురా.. రేపు నేను అమెరికా వెళ్తున్నా.. అని చెప్పారు. ఈ విషయమై స్పందించిన జైపాల్ రెడ్డి సరే మాట్లాడి చెబుతా అని బదులివ్వగా.. ఆయనతో పాటు 50, 100 మంది ఉన్నా సరే తీసుకురా.. పదవి విషయం తర్వాత ఆలోచిద్దాం అని సూచించారు.

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి

- ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ
- మంత్రి నిరంజన్ రెడ్డి



దుకాణ సముదాయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జైపాల్

ఆమనగల్లు: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని తెలిపారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రూ.65 లక్షలతో నిర్మించే 8 దుకాణ సముదాయ నిర్మాణాలకు శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న మార్కెట్ యార్డులను ఆధునీకరించామని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా సమీకృత మార్కెట్ యార్డులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని, రైతులకు అనుగుణంగా అనేక గోదాంలను నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న చిల్లర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్, వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, జెడ్పీటీసీ అనురాధ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్, ఎంపీటీసీ కుమార్, కౌన్సిలర్ రాధమ్మ, డైరెక్టర్లు లయక్ అలీ, సుభాష్, రమేష్, వెంకటయ్య, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో ఐక్యతను చాటుతున్న ఉద్యోగులు, ఆర్.కృష్ణయ్య

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించి, దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలు అడగడం మానుకుని తిరగబడటం నేర్చుకోవాలని, పోరాటాలు చేస్తే మన వాటా మనకు లభించదా అని ప్రశ్నించారు. 75 ఏళ్లు గడిచినా బీసీల బతుకులు మారలేదని, అధికారం అడ్డుపెట్టుకుని అగ్రకులాల వారు వేలు, లక్షల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లకు చట్టపరమైన, రాజ్యాంగ పరమైన, న్యాయపరమైన అవరోధాలు లేవని, గతంలో పాలించిన ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకే రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రెండేళ్ల క్రితం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టిందని, దీనికి దేశంలోని 14 పార్టీలు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్‌ను తొలగించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, అభివృద్ధికి ప్రత్యేక పథకాలను రూపొందించాలన్నారు. జాతీయ స్థాయిలో రూ. 2లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, జనాభా లెక్కల్లో బీసీ కులాల వారి లెక్కలను సేకరించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఈ యాదగిరి చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గుజ్జ కృష్ణ, సభ్యులు చంద్రుడు, మారం శ్రీనివాస్, నరేందర్, సదానందం, రామకృష్ణ, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూమ్స్ స్థానికులకే ఇవ్వాలి

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



మన్సాన్‌పల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్ల ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్స్ ఎదుట శుక్రవారం స్థానికులకే వాటిని కేటాయించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్న ఇప్పటి వరకు కేటాయించకుండా ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. స్థానికంగా అర్హతలున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చొరవ తీసుకొని ఈ నెల 30వ తేదీ వరకు స్థానికులకు డబుల్‌బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని, లేదంటే మన్సాన్‌పల్లి డబుల్ బెడ్రూమ్స్ ఎదుట 36 గంటల సత్యాగ్రహ దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలి

కందుకూరు: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుముందు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అమలు చేయనున్న పథకాలను ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించి పార్టీ వైపు ఆకర్షితులను చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పీసీసీ సెక్రటరీ అమరేందర్ రెడ్డి, ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఎస్. మల్లేష్, కొత్త మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల కాంగి'రేసులో' ఆశావహులు

- స్థానికులతోపాటు ఇతర జిల్లాల నేతల దృష్టి
- తామే బరిలో ఉంటామని ప్రచారం
- స్థానికులకే చాన్స్ ఇవ్వాలంటున్న లోకల్ లీడర్లు
- 24న 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్' సభ
- సన్నాహక సమావేశాలతో లీడర్లు బిజీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల నియోజకవర్గంపై కాంగ్రెస్ గురిపెట్టింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్, సరూర్‌నగర్ వేదికగా యువత డిక్లరేషన్, ఖమ్మం వేదికగా పెన్షన్ డిక్లరేషన్ ప్రకటించిన ఆ పార్టీ తాజాగా చేవెళ్ల వేదికగా ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఈ నెల 24న సాయంత్రం 4 గంటలకు చేవెళ్ల కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి సుమారు లక్ష మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలకు చెందిన నేతలు జనసమీకరణ కోసం సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొయినాబాద్ మండలం కనకమామిడి పరిధిలోని ఫాంహౌసుల్లో నేతలు తరచూ భేటీ అవుతున్నారు.

అసంతృప్తిలో ఆశావహులు

చేవెళ్ల మొదటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా గుర్తింపు పొందింది. అప్పటి వరకు జనరల్ కేటగిరీలో ఉన్న ఈ నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా 2009లో ఎస్సీకి రిజర్వ్ అయింది. సంస్థాగతంగా పార్టీకి మంచి పట్టు ఉంది. ఇక్కడి నుంచి చేపట్టిన ఏ కార్యక్రమైనా విజయవంతమవుతుందనే భావన పార్టీలో ఉంది. కీలకమైన ఈ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు నేతలు పోటీ పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి అసెంబ్లీకి పోటీ చేసేందుకు స్థానికులతో పాటు సరిహద్దు జిల్లా లీడర్లు తహతహలాడుతున్నారు. గత ఎన్నిల్లో కాంగ్రెస్ నుంచి రత్నం పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే స్థాయి నాయకుడు లేకపోయినా షాబాద్ మండలానికి చెందిన భీంభరత్, చేవెళ్ల మండలానికి చెందిన వసంతం, మొయినాబాద్‌కు చెందిన దర్శన్, శంషాబాద్‌కు చెందిన రాచమల్ల సిద్దేశ్వర్ ఇక్కడ పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచారు. తమలో ఎవరో ఒకరికి టికెట్ ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. క్షేత్రస్థాయి లీడర్లు, కేడర్ అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లోకల్ వర్సెస్ నాన్ లోకల్

తాజాగా వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశేఖర్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరికను పార్టీ కేడర్ ఆహ్వానిస్తుండగా చేవెళ్ల నుంచి అసెంబ్లీకి పోటీ చేయనున్నట్లు ఆయన ప్రచారం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. తాజా ప్రచారం నేపథ్యంలో పార్టీ నేతల మధ్య లోకల్.. నాన్‌లోకల్ ఫీలింగ్ ఏర్పడింది. సంక్షోభ సమయంలో పార్టీని అంటిపెట్టుకున్న స్థానిక నేతలను కాదని, ఇతర జిల్లాలు, పార్టీల నుంచి వలస వచ్చిన స్థానికేతరులకు టికెట్ ఇస్తే అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటం, ఇతర జిల్లాల్లోని నేతలు సైతం ఇదే నియోజ కవర్గంపై దృష్టి సారించడం, వరుసగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ సన్నాహక సమావేశాలతో కాంగ్రెస్‌లో కాక పెరిగింది.

12 మందితో కో ఆర్డినేషన్ కమిటీ

ఈ నెల 24న నిర్వహించనున్న చేవెళ్ల సభను విజయవంతం చేసేందుకు 12 మంది సీనియర్ నాయకులతో కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక జాబితాను విడుదల చేశారు. ఈ కమిటీలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, భీంభరత్, వసంతం, గౌరీసతీష్ యాదవ్, పెంటయ్య గౌడ్ సభ్యులుగా ఉన్నారు. సభస్థలి మొదలు.. కార్యకర్తల తరలింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీటి సరఫరా, ముఖ్య అతిథులకు ఆహ్వానం పలకడం వంటి ఏర్పాట్లు ఈ కమిటీ చూసుకోనుంది. ఈ కమిటీలో సీనియర్ నేత కేఎల్ఆర్‌ను భాగస్వామిగా చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. ఆస్పత్రిలో మృతి

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై గునుగల్ గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గునుగల్‌కు చెందిన ఎం.యాదగిరి(38) మాల్‌లో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి 7:30 సమయంలో గునుగల్ గ్రామానికి వచ్చి.. కాలినడకన కృష్ణా రిజర్వాయర్ వైపు రోడ్డు దాటుతుండగా.. యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వేగంగా వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఇతనికి భార్య సంతోష, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ సైదయ్య తెలిపారు.

మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరాలి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

మహేశ్వరం: టీడీపీ సీనియర్ నాయకుడు అల్లె శంకర్ శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు చెరుకు శ్రీనివాస్, జావిద్‌ఖాన్, అంజనేయులుగౌడ్, పాండయ్య తదితరులకు కాషాయ కండువాలు వేసిన మంత్రి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగరేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమకే అధికారం వస్తుందని పగటి కలలు కంటున్నాయని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో వచ్చేది బీజేపీయేనని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్, కడారి జంగయ్య యాదవ్, మహేశ్వరం ఎంపీటీసీ సుదర్శన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, తుక్కుగూడ బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల, బీసీ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమంలో నంబర్ వన్

ధాన్య భాండాగారంగా తెలంగాణ

- 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌రెడ్డి



దాస్యతండాలో తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జైపాల్‌రెడ్డి

తలకొండపల్లి: సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వీరన్నపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, బీటీ రోడ్డు, దాస్యతండాలో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తామని స్పష్టంచేశారు. 24గంటల పాటు నిర్విరామంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. కోటియాభై లక్షల ఎకరాలకు సాగునీరు అందజేస్తున్న తెలంగాణ ధాన్య భాండాగారంగా మారిందని సంతోషం వ్యక్తంచేశారు. రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం చేరువైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహ, సర్పంచ్‌లు నాగమణిలింగంగౌడ్, రాములునాయక్, ఈశ్వర్‌నాయక్, సీనియర్ నాయకుడు దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బోస్ వెంకటయ్య, ఢిల్లీ కృష్ణయ్య, శరత్‌చంద్రశర్మ, శుక్రు, రఫీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు 'మద్దతు' ఇవ్వండి

పట్టు పరిశ్రమను ఆదుకోవాలని, కిలో పట్టు గూళ్లకు రూ.550 మద్దతు ధర ఇవ్వాలని పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మూడావత్తు శక్రునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోరింతకుంటతండాలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ, కర్ణాటకలో కిలో పట్టు గూళ్లకు రూ.600 ఇస్తుండగా.. హైదరాబాద్‌లో మాత్రం రూ.400 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టు షెడ్ల నిర్మాణానికి 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. గతంలో కిలో పట్టుగూళ్లకు రూ.75 ప్రోత్సాహకం ఇచ్చేవారని, మూడేళ్లుగా ఇవ్వడం లేదని తెలిపారు. పట్టు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రఫీ, సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ రమేశ్, వినోద్, నర్సింహ్మా, రవీందర్ ఉన్నారు.

కేసీఆర్‌తోనే దళితుల అభ్యున్నతి

- అంబేడ్కర్ భవనానికి స్థలాలు, నిధులు కేటాయిస్తాం
- మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రావిర్యాల దళిత సంఘం నాయకులు

తుక్కుగూడ: రావిర్యాలలో అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ భవన్‌లకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేస్తామని విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన దళిత నాయకులు శుక్రవారం నగరంలోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం, అభ్యున్నతికి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశం గర్వించే విధంగా హైదరాబాద్ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.10 లక్షల సాయం అందిస్తున్నారని స్పష్టంచేశారు. రావిర్యాల, కొంగరఖుర్దు ఎస్సీ బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో రావిర్యాల మాజీ సర్పంచ్ బాట సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు రావుగళ్ల బాబు, దళిత సంఘం నాయకులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పి.నర్సింహ, యాదయ్య, అమరేందర్, జగన్, యాదయ్య, బాల్‌రాజ్, ఈశ్వరయ్య, లక్ష్మయ్య, దాసు, యాదయ్య, లాజర్ తదితరులు ఉన్నారు.

చేయిచేయి కలుపుదాం పచ్చదనాన్ని పరిరక్షిద్దాం



పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో సీడ్ బాల్స్ తయారు చేస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్

- గ్రీన్ ఇండియా చాలెంజ్ నాయకులు, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్
- పల్లవి పాఠశాలలో విద్యార్థులతో కలిసి సీడ్ బాల్స్ తయారీ

మొయినాబాద్ రూరల్: 'చేయి చేయి కలుపుదాం పచ్చదనాన్ని పరిరక్షిద్దాం' అని గ్రీన్ ఇండియా చాలెంజ్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీడ్ బాల్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కొమురయ్య, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధి మమతతో కలిసి సీడ్ బాల్స్ తయారు చేశారు. మట్టిని ముద్దలుగా చేసి అందులో పలు రకాల మొక్కలకు చెందిన విత్తనాలు కలిపి సీడ్ బాల్స్ తయారు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఖాళీ స్థలాల్లో వీటిని విసిరేశారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే తెలంగాణ రాష్ట్రం గ్రీనరీతో విరాజిల్లుతోందని తెలిపారు. ఏటా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం హరిత తెలంగాణగా రూపు దిద్దుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జహీర్, యశస్వి, ప్రిన్సిపల్ యమమాధ భూషి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, రాఘవేందర్‌యాదవ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

బీజేపీ నాయకుల మండిపాటు

- ప్రభుత్వ తీరుకు నిరసనగా షాద్‌నగర్‌లో ధర్నా
- పలువురి అరెస్టు, విడుదల



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

షాద్‌నగర్ రూరల్: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాస్తారోకో నిర్వహించి ధర్నా చేపట్టారు. రాస్తారోకోకు దిగిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ మాట్లాడతూ.. రాష్ట్రంలో తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజా సమస్యలను గాలి కొదిలేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపితే పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్త మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, దళితబంధు, బీసీబంధు, నిరుద్యోగ భృతి వంటి అనేక పథకాలు అమలుకు నోచుటకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడం, కొత్త హామీలతో మభ్యపెట్టడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. సొంతపూచీకత్తుపై వదిలేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, మురళి, వంశీకృష్ణ, శంకర్, మోహన్‌సింగ్, శివాజీ, శంకర్‌నాయక్, లష్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య కృష్ణారావు అంత్యక్రియలు

రాయదుర్గం: సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌వీఎం కృష్ణారావు అంత్యక్రియలను శుక్రవారం అశ్రునయనాల మధ్య రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానంలో నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీలోని ఆయన నివాసం నుంచి ప్రత్యేక వాహనంలో వైకుంఠ మహా ప్రస్థానానికి పార్థివదేహాన్ని తరలించి తుది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కృష్ణారావుకు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు, మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. కుమారుడు కిరీటి, కుమార్తె కిన్నెర, భార్య లక్ష్మి, ఇతర కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.